




మానవహక్కులను వివరిస్తున్న రిటైర్డ్ జడ్జి గుర్రప్ప

'కాప్రికార్న్' కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - సత్యవేడు

మండలంలోని పాలగుంట గ్రామంలో కాప్రికార్న్ ఫుడ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. విధుల్లోకి తీసుకునేంత వరకూ తమ రిలే నిరాహారదీక్ష కొనసాగుతుందని, సిఐటియు కార్మికులకు అండగా ఉంటుందని చెప్పారు. మంగళవారం దీక్షలను ఉద్దేశించి మెలుగు రమేష్ మాట్లాడుతూ కాప్రికార్న్ పరిశ్రమ యాజమాన్యం దురుద్దేశ్యంతో దాదాపు 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అన్యాయంగా తొలగించిందన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కార్మికులను ఉన్నపళంగా తొలగించడం ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా కార్మికులను తొలగించడాన్ని సిఐటియు ఖండిస్తుందన్నారు. డిసెంబర్ 7 నుంచి శాంతియుత నిరసన చేపడుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడాన్ని మండిపడ్డారు.

4వ రోజూ కొనసాగుతున్న రిలేదీక్ష

తమను తిరిగి పనిలోకి తీసుకోవాలని యాజమాన్యానికి వినతిపత్రం ఇచ్చినా అధికారుల నుంచి స్పందన కరువయ్యిందన్నారు. యాజమాన్యం మొండివైఖరి వీడి కార్మికుల బకాయి జీతాలను చెల్లించి, విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే కార్మికులను విధుల్లోకి తీసుకునేంత వరకూ పోరాటం చేస్తామన్నారు. టిఎన్‌టియుసి సభ్యులు రవి మాట్లాడుతూ కాప్రికాన్ కంపెనీ దాదాపు 25 ఏళ్లుగా నడుస్తోందని, దాదాపు 45 మంది కార్మికులను విధుల్లోనుంచి తొలగించడం సమంజసం కాదన్నారు. వీరంతా 40 ఏళ్ల పైబడిన వారని, వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. గత నెల జీతాన్ని యాజమాన్యం చెల్లించకపోవడంతో కార్మికులు పస్తులతో గడుపుతున్నారన్నారు. విధుల్లోకి తీసుకునేంత వరకూ కార్మికులకు అండగా ఉంటామని చెప్పారు.



కార్మికులకు అండగా సిఐటియు, టిఎన్‌టియుసి నాయకులు

'సిజేరియన్ చేస్తామని చెప్పి...'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సిజేరియన్ ఆపరేషన్ అని చెప్పి చివరకు కాన్పు కష్టమనీ, రక్త నిల్వలు లేవని ఓ డెలివరీ కేసును తిరుపతికి రెఫర్ చేశారు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు. తొట్టంబేడు మండలానికి చెందిన మంజూషా రెండో కాన్పు నిమిత్తం ఈనెల 2వ తేదీన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వచ్చింది. పరీక్షించిన ఆస్పత్రి వైద్యురాలు 6వ తేదీన వస్తే చేర్చుకుంటామన్నారు. వైద్యురాలి సూచన మేరకు 6వ తేదీ వచ్చిన గర్భిణిని 9వ తేదీన ఉదయం రావాలంటూ మళ్ళీ తిప్పి పంపారు. అయితే సోమవారం ప్రసవం కోసం ఆసుపత్రికి చేరుకున్న ఆమెకు వింత అనుభవం ఎదురయ్యింది. కాన్పుకి సిద్ధం చేసిన వైద్యురాలు ఆస్పత్రిలో రక్త నిల్వలు లేవని అత్యవసరంగా తిరుపతికి వెళ్లాలని సూచించినట్లు మంజూషా భర్త తెలిపారు. ఈ విషయంపై శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా మంజూషాకు మొదటి కాన్పు సిజేరియన్ జరిగిందన్నారు. రెండో కాన్పు కూడా సిజేరియన్ చేయాల్సి రావడం, కాన్పుకు సమయం మరో 20 రోజులు ఉండడంతో ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశామని తెలిపారు. తల్లీబిడ్డ క్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామనీ, అయితే వైద్యురాలి సమన్వయ లోపం కారణంగా మంజుషా బంధువులు నిరుత్సాహపడ్డారని వివరణ ఇచ్చారు. ఆమెకు గురువారం సిజేరియన్ ద్వారా రెండో బిడ్డకు కాన్పు చేస్తామని హామీ ఇచ్చారు. రక్తం నిల్వలు కూడా ఆస్పత్రిలో సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు.



తల్లీబిడ్డ క్షేమమే ఆరోగ్య శాఖ లక్ష్యం

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

తల్లీబిడ్డ క్షేమమే ఆరోగ్యశాఖ లక్ష్యమని, ప్రతినెలా 9, 10 తేదీల్లో మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు వైద్యులు డాక్టర్ దివాకర్, విద్యాసాగర్, ఆరోగ్య అధికారి డివిన్ వెంకటేశ్వర్లు తెలిపారు. మహిళలు నెలతప్పిన వెంటనే ఎఎన్ఎం వద్ద పేరును నమోదు చేసుకుని ఎంసిపి కార్డు పొందాలన్నారు. తద్వాంమైదువేల రూపాయలు వారి అకౌంట్లో జమ చేస్తామన్నారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే మరో ఐదువేల రూపాయలు వారి అకౌంట్లో జమ చేస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు చేసుకుంటే జననీ సురక్ష యోజన పథకం కింద వెయ్యి రూపాయలు అకౌంట్లో వేస్తారని తెలిపారు. ప్రతి మహిళ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవం చేసుకోవాలని, 108 ద్వారా గర్భవతులను ఆస్పత్రికి తరలించి, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా వారిని క్షేమంగా ఇంటికి చేరుస్తున్నామన్నారు. సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గీతా జయంతి సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా ఈ నెల 11వ తేదీన జరిగే పునరంకిత శోభాయాత్రను జయప్రదం చేయాలని ఆ క్షేత్రం కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పరిపాలనా భవనం ఎదుట జానపద వత్తి కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో అఖండ హరినామ సంకీర్తన భజనల సాధన, తిరుమల కొండపై కూల్చేసిన అన్నమయ్య ఇంటి పునర్ నిర్మాణం లక్ష్యంగా శోభాయాత్ర ఉంటుందని వెంకటయ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జానపద వత్తి కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు. సుధాకర్, రమణమ్మ, వంశీకష్ణ, రాజారెడ్డి, రామచంద్రయ్య, చిరంజీవి, గాదిరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సస్పెన్షన్ రద్దు చేసేంతవరకూ పోరాడతాం : సిఐటియు



ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరులో డిపో పరిధిలో అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం కెఎస్ వాసు అధ్యక్షతన మంగళవారానికి ఆరో రోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘాన్ని బలహీనపరచాలని అక్రమ సస్పెన్షన్‌కు పూనుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. సస్పెన్షను రద్దు చేసేంత వరకూ పోరాటానికి తాము సిద్ధమని హెచ్చరించారు. సంస్థ పరిరక్షణకు ఎస్‌డబ్ల్యుఎఫ్ చారిత్రాత్మక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి సంఘాన్ని తొక్కి పెట్టడానికి గూడూరు డిపో మేనేజర్ పూనుకోవడం భావ్యం కాదన్నారు. చట్టం అందరికీ ఒకేలా వర్తిస్తుందని, ఒక్కొక్క యూనియన్‌కు ఒక్కొక్క రకంగా ఉండదని, ఇతర సంఘాలకు 1/2019 సర్క్యులర్ వర్తింపజేస్తూ ఎస్.డబ్ల్యు.ఎఫ్ సంఘానికి చెందిన కార్మికులను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. డిపో మేనేజర్ ఏకపక్ష ధోరణిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ రాము, ఎస్ఎస్‌వి కృష్ణ, రఘురాం, కత్తి సుబ్రమణ్యం, ఎ.శీనయ్య, సుబ్రమణ్యం, ఎంఎస్ వాసులు, నాగేశ్వరరావు, పి.కిరణ్, సిఐటియు గూడూరు పట్టణ నాయకులు జోగి శివకుమార్ పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలంటూ తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం సంఘమిత్రలు మహాలక్ష్మి, భూలక్ష్మి, రేవతి, సరస్వతి, మాధవిలు ఎపిఒ ఇందిరకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజకీయ ఒత్తిళ్లతో తమను విధుల నుంచి పక్కన పెట్టారని, హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. జీతభత్యాలు సైతం చెల్లించాలని తీర్పులో పేర్కొందన్నారు. సీఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో తిప్పలు

ప్రజాశక్తి - క్యాంపస్

గత నాలుగు రోజులుగా ఎస్వియూ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ముఖ్యంగా తిరుపతి పట్టణంలోని ప్రధాన సెంటర్లలో విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వర్సిటీ నుంచి హై పవర్ కమిటీ గాని, అబ్జర్వేషన్ కమిటీలు గాని లేకపోవడం వల్ల మాల్ ప్రాక్టీస్కు పాల్పడుతున్నా సరైన నియంత్రణ లేదని విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. స్వయానా కళాశాల యాజమాన్యాలే విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా కాపీ కొట్టేందుకు అవకాశం ఇస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. పరీక్ష సమయం కంటే విద్యార్థులు గంట ముందు వస్తే ఎండలోనే నిలబడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కళాశాలల్లో వాహనాల పార్కింగ్‌కు, విద్యార్థులు కనీసం నిలబడేందుకు అవకాశం లేకపోతే ఆ పరీక్షా కేంద్రాలను ఎలా కొనసాగిస్తారని విద్యార్థిసంఘాల నాయకులు వాపోతున్నారు. అనేక డిగ్రీ కళాశాలల్లో సరైన ల్యాబ్ సౌకర్యం, తాగునీటి సదుపాయం, ఆటస్థలం, మరుగుదొడ్లు సైతం లేని పరిస్థితి. విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించిన పరీక్షా కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్‌చేస్తున్నారు.



పరీక్షా కేంద్రాల వద్ద మండుటెండలో విద్యార్థులు

మానవహక్కులను పరిరక్షించుకోవాలి : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్, తిరుపతి సిటి

దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ, మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన స్వేచ్ఛలను కాపాడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వర్సిటీ వీసీ ఆచార్య సిహెచ్ అప్పారావు అన్నారు. ఎస్వీయూలో 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు మంగళవారం సెనెట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రతి మనిషికీ పుట్టుకతో సంక్రమించిన హక్కులను, రాజ్యాంగపరంగా లభించిన హక్కులను హరించే అధికారం ఎవరికి లేదని, సమ సమాజ స్థాపన కొరకు మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరి హక్కులను గుర్తించి గౌరవించాలని అన్నారు. ఎస్వియు ఆర్ట్స్ కళాశాల డీన్ ఆచార్య బివి మురళీధర్ మాట్లాడుతూ రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం మానవ హక్కుల ఉల్లంఘన తదితర పరిణామాలను విశ్లేషించి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ మానవ హక్కుల నియమ నిబంధనలను 1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టి ఆమోదించారన్నారు. వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి ఆచార్య సుధారాణి మాట్లాడుతూ మానవుడు విద్యావంతుడు అయ్యే కొద్దీ మానవ హక్కుల ఉల్లంఘన తగ్గాల్సిందిపోయి, పెరుగుతుందనీ ఇది సమ సమాజ స్థాపనకు మంచిది కాదని, ముఖ్యంగా చిన్న పిల్లలపై, మహిళలపై హింస వివక్షత వంటివి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు వ్యాసరచన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వివేక్, రంజిత్ కుమార్, రవిబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

సెట్విన్ తిరుపతి వారి సౌజన్యంతో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు జరిగాయి. స్థానిక బైరాగిపట్టెడలోని ఎస్ జి ఎస్ ఆర్ కళాశాలలో జరిగిన ఈ సదస్సుకు ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సి మోహన్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కరన్, విజయ భాస్కర్, కె.ప్రతాప్, సజన, చంద్రయ్య, ఆజాద్ చంద్రశేఖర్ డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విద్యార్థులు ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) కార్యదర్శి డాక్టర్ వెంకట నారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగం, వివిధ చట్టాలు మానవ హక్కులను పరిరక్షించేందుకు చాలా బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. మధుసూదన్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పైడి అంకయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి అభినందించారు.



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మహిళల హక్కులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప మాట్లాడుతూ అంబేద్కర్ మహిళల విద్య, ఉద్యోగం ఉన్నతికి సంబంధించి రాజ్యాంగంలో వాసి అందులో మహిళలకు చేసిన సేవలు కొనియాడదగినవని అన్నారు. మహిళా హక్కులు కూడా మానవ హక్కులే అని డైరెక్టర్ ఆచార్య డి సాయి సుజాత అన్నారు. శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం సెక్రటరీ శంకరి, ఎండి మురుగేష్, సీఈవో ధర్మేంద్ర పాల్గొన్నారు.

తడలో... కాశింగాడు కుప్పం ఎంపియుపి పాఠశాలలో ప్రాథమిక హక్కులు, మానవహక్కుల తేడాలను ఉపాధ్యాయులు వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పి.రఘురామయ్య, ఉపాధ్యాయులు ఎస్.కరీముల్లా, పి.పద్మజారాణి, బి.సుధాకర్, ఎం.సుబ్రమణ్యం, ఆర్.సంధ్యాలక్ష్మి, ఎం.తిరుపతి, వై.సుబ్బరామదాస్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్)


మండలంలోని సి.మల్లవరం పంచాయతీలో పంచాయతీ నిధుల దుర్వినియోగం గురించి జిపిఆర్‌ఎస్ లో వచ్చిన ఫిర్యాదు పై తిరుపతి డిఎల్పిఒ సురేష్ నాయుడు విచారణ చేపట్టారు.. మంగళవారం సి మల్లవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ నిధుల జమ ఖర్చులు, తాగునీటి కనెక్షన్లు, ప్లాట్స్ అప్రూవల్స్ పై వచ్చిన రాబడి, ఇంటి పన్నులు వసూళ్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీకి వచ్చిన నిధులకు సంబంధించి క్యాష్ బుక్ ను, బ్యాంకు లావాదేవీలను ఆయన పరిశీలించారు. నవంబర్ 18 వ తారీఖున గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి ప్రతి సోమవారం కలెక్టేట్లో నిర్వహించి జిపిఆర్‌ఎస్ కార్యక్రమంలో సి మల్లవరం పంచాయతీ నిధులను పంచాయతీ సర్పంచ్ మొక్కల భారతి, గతంలో పనిచేసిన



పంచాయతీ కార్యదర్శి దుష్యంత్ రెడ్డిలు నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విచారణ చేయాలని డిఎల్పిఒ ను ఆదేశించారు. మంగళవారం విచారణ చేపట్టి..... గ్రామస్తుల నుండి పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఎల్పిఒ సురేష్ నాయుడు మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి, విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి ద్వారా కలెక్టర్‌కు సమర్పిస్తానని తెలిపారు. విచారణ సమయంలో విచారణ అధికారి డి ఎల్ పి ఓ సురేష్ నాయుడు ముందే సర్పంచ్ మొక్కల భారతి, మొక్కల తిమ్మారెడ్డిలు ఫిర్యాదు చేసిన నవీన్, మనోహర్ నాయుడులు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. విచారణాధికారి సురేష్‌నాయుడు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. నిధులు పక్కదారి పట్టాయా లేదా అన్నది విచారణ అనంతరం నివేదిక ఆధారంగా తేలాల్సి ఉంది.

మీడియాపై దాడి అమానుషం : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



మోహన్ బాబు యూనివర్సిటీ రోడ్డుపైన సోమవారం విజువల్స్ తీస్తున్న టీవీ ఛానల్ విలేకరులపై బౌన్సర్స్ చేసిన దాడిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు పేర్కొన్నారు. యూనివర్సిటీ అని పేరు పెట్టుకుని ఎవరికీ ప్రవేశం లేని దుర్భేధ్యం లాగా ఉండడం అనేది ఉన్నత విద్యాలయాలకు తగదన్నారు. తమ ఆస్తి గొడవలు ఎక్కడ బయటకు పొక్కుతాయోనన్న దురుద్దేశ్యంతో రోడ్డుపై విజివల్స్ తీస్తున్న విలేకరులపై దాడి చేయడాన్ని ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలన్నారు. యూజీసీ సైతం ఈ యూనివర్సిటీకి అనుమతి గురించి పరిశీలన చేయాలని పేర్కొన్నారు. పోలీసులు చర్య తీసుకోని ఎడల అన్ని పక్షాలను కలుపుకొని ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

తొట్టంబేడులో భూదందాలు అధికం : బొజ్జల



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొట్టంబేడు మండలం వేదికగా భారీ ఎత్తున భూ దందాలు జరిగాయని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. అన్యాక్రాంతమైన ప్రతి సెంటు భూమినీ తిరిగి చేజిక్కించుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భూ వివాదాల పరిష్కారం, కేసుల నమోదులో రెవెన్యూ అధికారులు, పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. తొట్టంబేడు మండలంలోని బోనపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరిస్తుందనీ, నిర్దిష్ట సమయంలో సమస్యను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అలా కానిపక్షంలో సమస్య పరిష్కరించకపోవడానికి గల కారణాలను వెల్లడిస్తారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా అక్రమ కట్టడాలను కూల్చేసినట్లు చెప్పారు. అయితే కొందరు వైసీపీ నేతలు కోర్టు మెట్లెక్కిన కారణంగా కొన్ని అక్రమ కట్టడాల కూల్చివేతలో కాస్త ఆలస్యం జరిగిందని ఒప్పుకున్నారు. కానీ కొందరు తానేదో వాళ్లతో బేరసారాలు జరిపినట్లుగా వదంతులు పుట్టిస్తున్నారంటూ కొట్టి పారేశారు. కోర్టు తీర్పు వెల్లడైన మరుక్షణమే అక్రమ కట్టడాల కూల్చివేత తథ్యమని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, వైసీపీ కార్యకర్తల భూ బాధితులు ఎవరైనా ఉంటే రెవెన్యూ సదస్సుల వేదికగానే వారిపై కేసులు నమోదు చేయొచ్చని సూచించారు. రెవెన్యూ అధికారులు మామూళ్లు అడిగినా, పోలీసు అధికారులు బాధితులను పట్టించుకోకుండా గత ప్రభుత్వంలోలా వ్యవహరించినా సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహశీల్దార్ మధుసూదన్ రావు, టిడిపి నేతలు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, జయచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ దావులూరు రామానాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుటే బాహాబాహీ

బోనుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భూ తగాదాపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఎమ్మెల్యే ఎదుటే ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో ఇరు వర్గాల వారు ఘర్షణకు దిగారు. ఫలితంగా రెవెన్యూ సదస్సు కాస్త రణరంగంగా మారింది. అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితిని అదుపు చేసి ఇరు వర్గాలకు సర్ది చెప్పారు. ఘర్షణకు దిగిన వారు ఓ మాజీ సర్పంచ్ బంధువు కావడం గమనార్హం.

చిల్లకూరులో.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని ఎంఎల్‌ఎ పాశిం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. పేదల భూములను ధనికులు ఆక్రమిస్తే తిరిగి వారి భూములను పేదలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఆక్రమించుకుని పేదలు సాగు చేస్తుంటే వారికి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. భూకబ్జాదారులను ఉపేక్షించేది లేదన్నారు. ఎంఆర్ఒ శ్రీనివాసులు, విఆర్ఒ రమణయ్య,నాయకులు మూగ శంకరయ్య, పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో... ఫిర్యాదుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారని ప్రత్యేకాధికారి వెంకటరాజు అన్నారు. పేదలకు ఈ సదస్సులు ఎంతో ఉపయోగకరమన్నారు. వైఎస్ఆర్‌సిపి హయాంలో రీసర్వే వల్ల వచ్చిన సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. నాయకులు మావిళ్లపల్లి సుధాకర్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ మించల నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, విఆర్ఒ భాస్కర్ పాల్గొన్నారు.

ఏర్పేడులో... పంగూరు పంచాయతి కాట్ర కాయలగుంట గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో ఇంటి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 10 దరఖాస్తులు అందగా వాటిలో ఇంటి పట్టాలకు సంబంధించి-4, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్స్ -4, రైట్స్ ఆఫ్ రికార్డ్స్ -2 అందాయని ఎమ్మార్వో తెలిపారు. ఈ సదస్సులో ఆర్ ఐ సుబ్రహ్మణ్యం, డీపీ రోజా రమణి, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కోటలో... ఎటువంటి అవకతవకలు లేకుండా ఉండటానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పార్లమెంట్ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. వైసిపి హయాంలో మాజీ ముఖ్యమంత్రి ఫొటోను పాస్‌బుక్కుల్లో ముద్రించారని, సర్వేరాళ్లపై జగనన్న పేరు రాయడం వంటి ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు 696 : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 6 నుండి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, జిల్లావ్యాప్తంగా మంగళవారం 32 గ్రామసభలు నిర్వహించామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. తిరుపతి జిల్లాలో మొత్తం 696 అర్జీలు వచ్చాయని, అందులో ల్యాండ్ గ్రాభింగ్‌పై-16, ఫామ్ 22 ఏ పై -11, హౌస్ సైట్స్‌పై- 53, ఆర్ఓఆర్‌పై- 283, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ పై -41, ఇతర విషయాలకు సంబంధించి - 223 అర్జీలు వచ్చాయని తెలిపారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించబడ్డాయని, మిగిలిన అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.



17 నుంచి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16వ తేదీన ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17వ తేదీ నుండి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14న ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు.

సంస్కృత వర్సిటీలో మెగా ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్

'దేశ్ కా ప్రకృతి పరిరక్షణ'లో భాగంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరించి జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం, యోగా విజ్ఞాన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద డిస్పెన్సరీ, వర్సిటీలోని యోగా మందిరంలో 'మెగా ఆయుర్వేద శిబిరాన్ని' నిర్వహించారు. విసి ఆచార్య జిఎస్ఆర్ కష్ణమూర్తి శిబిరం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇలాంటి ప్రచారాలు భారతీయ వైద్య వ్యవస్థకు మంచి సందేశాన్ని అందజేస్తాయన్నారు. భారతీయ ఆయుర్వేద విద్యావిధానం ద్వారా ఎన్నో రోగాలకు చికిత్సను వివరించారు. ఆయుర్వేదం, యోగశాస్త్రం, సంస్కృతభాష మనకు అందించిన దివ్యాస్త్రాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ నియమాలను పాటిస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని వివరించారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఆర్‌జె.రమశ్రీ మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య సంబంధిత ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఆయుర్వేద వైద్య విధానానికి ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని వివరించారు. అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, ఇన్చార్జి ప్రొక్టార్ ప్రొఫెసర్ సి. రంగనాథన్ పాల్గొన్నారు.

తిరుపతిలో స్విగ్గి బోల్ట్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్

అగ్రగామి ఆన్ డిమాండ్ కన్వీనియెన్స్ ప్లాట్‌ఫారమ్ స్విగ్గీ లిమిటెడ్ తిరుపతి నగరంలో పది నిమిషాలలో ఫుడ్ డెలివరీ సర్వీస్ బోల్ట్ సేవలను మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా స్విగ్గి ప్రాంతీయ ప్రతినిధి సిద్ధార్థ బాకో మాట్లాడుతూ బోల్ట్ ప్రసిద్ధ రెస్టారెంట్‌లు, క్యూ ఎస్ఆర్ ల నుండి కేవలం 10 నిమిషాల్లో తాజాగా తయారయ్యే ఆహారాన్ని డెలివరీని చేస్తుందన్నారు. స్విగ్గీ దేశవ్యాప్తంగా 400 నగరాలకు బోల్ట్‌ను విస్తరించిందని, 40వేల కంటే ఎక్కువ పాల్గొనే రెస్టారెంట్‌ల నుండి 10 లక్షలకు పైగా వస్తువులను డెలివరీ చేస్తోందన్నారు. తిరుపతిలోని కస్టమర్లు నగరంలోని 120 రెస్టారెంట్‌లలోని 13 వంటకాల నుండి 3.5 వేల వంటకాల నుండి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సేవలను నగర ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి : ఎంపి

తిరుపతి టౌన్ : తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ శీతాకాలం సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో మంగళవారం ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రతిరోజూ దేశవిదేశాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో వస్తుంటారని, శరవేగంగా తిరుపతి జిల్లా అభివృద్ధి చెందుతున్న కారణంగా రైల్వే డివిజన్ ఏర్పాటు ఎంతో అవశ్యమని అన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలపై జరిగిన నేరాలు, మానవహక్కుల ఉల్లంఘనలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు.

నడివీధి గంగమ్మకు 'మేయర్' సారె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పెద్దకాపు వీధి నడివీధి గంగమ్మకు తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ గుడి నుండి మేళతాళాలతో మంగళవారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష సారెను అందజేశారు. ప్రతి యేటా జరిగే పెద్ద కాపు వీధి నడివీధి గంగమ్మ జాతర ఆనవాయితీగా ఆ గ్రామ పెద్దలు నిర్వహిస్తుంటారు. మేయర్ డాక్టర్ శిరీష దంపతులు పాల్గొని నడివీధి గంగమ్మకు తాతయ్యగుంట గంగమ్మ గుడి నుండి మేళతాళాలతో సారె అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు గ్రామ పెద్దలు దొడ్డా రెడ్డి సిద్ధారెడ్డి, యాలమురి శ్రీనివాసరెడ్డి, మునయ్య యాదవ్, డాక్టర్ మునిశేఖర్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లో లేత నారు నాటాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తూర్పు మండలాల్లో వరినాట్లు వేయడం ప్రారంభమయ్యిందని, రైతులు 3-4 వారాల లేతనారు నాటాలని జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య తెలిపారు. నారు తేసేందుకు వారం రోజుల ముందే ఎకరాకు సరిపడా నారుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను చల్లి, నీరు పెట్టి, నారుమడిలో నీరు ఇంకేటట్లు చేయాలన్నారు. దీనివలన పొలంలో నాటిన 3-4 వారాల వరకు తెల్లచీడ, కాండము తొలుచు పురుగు, ఉల్లి కోడు చీడలను అదుపులో ఉంచవచ్చని సూచించారు. నాట్లు చదరపు మీటరుకు 44 కుదుర్లు ఉండేటట్లు పైపైనే నాటాలన్నారు. నాటేముందు నారు కొనలు తప్పకుండా తుంచి నాటుకోవాలన్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్యను పెంచాలి : పీడీ

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్)

మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని తిరుపతి జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-2024 సంవత్సరానికి గాను చేపట్టిన పనుల తనిఖీపై సామాజిక తనిఖీ బహిరంగ సభ స్థానిక ఎంపీపీ యశోద అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు చోటు లేకుండా అభివద్ధి పనులు చేపట్టాలన్నారు. 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్ల 72 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేసిన 1358 పనులను ఎస్ ఆర్ పి రవి నేతత్వంలో 12 మంది డిఆర్పీలు పనులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలు ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎలాంటి అక్రమాలు జరగలేదని, రికవరీ నిల్ అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ శాఖ ద్వారా చేపట్టిన పనులలో రూ. 11 వేల రూపాయలు రికవరీకి ఆదేశించినట్లు పిడి తెలిపారు. గొల్లపల్లి పంచాయతీలు క్షేత్ర సహాయకురాలుగా పనిచేస్తున్న రమాదేవి కూలీలకు చెల్లించాల్సిన వేతనాలలో అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీలు తెరవడంతో రమాదేవిని సస్పెండ్ చేశారు. రమాదేవి వేతనాల అక్రమాలపై చంద్రగిరి ఏపీడి రెడ్డప్పను విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. తిరుపతి రూరల్ మండలంలో 18వ విడత సామాజిక తనిఖీ 12 రోజులపాటు నిర్వహించి సామాజిక తనిఖీ బందానికి లక్షలాది రూపాయలు ఖర్చులు చేసి ఉపాధి హామీ పథకంలో ఒక్క రూపాయి కూడా రికవరీ లేకపోవడాన్ని కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని పలువురు బహిరంగంగా విమర్శలు గుప్పించారు. బహిరంగ సామాజిక తనిఖీ కూడా తూతూ మంత్రంగా జరిగిందని ప్రజల ఆరోపణలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి శివయ్య, జడ్పిటిసి రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, ఏపీవో మమతారాణి, జే ఈ రాంబాబు పాల్గొన్నారు.




అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

టీటీడీ కాంప్లెక్స్‌కు వెళ్లే దారేది

పార్కింగ్ వాహనాలతో గందరగోళం

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని స్థానిక ఎస్‌వి హై స్కూల్ గ్రౌండ్ ఎదురుగా ఉన్నటువంటి టిటిడి షాపింగ్ కాంప్లెక్స్‌లో దాదాపుగా 40 షాపులు పైగా ఉన్నాయి. ఇందులో వ్యాపారానికి సంబంధించి బట్టల వ్యాపారం, జిరాక్స్ షాపుల వ్యాపారం, కాఫీ షాపుల, సిడి మొబైల్ షాప్, జ్యూస్ షాపులు అనేకం ఉన్నాయి. అయితే ఉదయం 9.30 గంటల ప్రాంతంలో అక్కడ బంగారు షాపులో పనిచేసే ఉద్యోగులు, మోహన్ బాబు యూనివర్సిటీకి వెళ్లే విద్యార్థులు బండి పార్కింగ్ కేంద్రంగా షాపులు ఎదురుగా వాహనాలు నిలబెడుతున్నారని షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపులకు ఎదురుగా వాహనాలు పెట్టడం వల్ల తమ వ్యాపారాలు సైతం సరిగ్గా జరగడం లేదని వాపోయారు. ఈ టిటిడి షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేకమైన టాయిలెట్ సౌకర్యం సైతం లేదు. షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్నటువంటి బాలాజీ బస్టాండ్ ఎదురుగా ప్రతిరోజూ విద్యార్థులు నిరీక్షిస్తూ ఉంటారు. టిటిడి యాజమాన్యం స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌కు వచ్చే వారికి టాయిలెట్ సౌకర్యం కల్పించడంతో పాటు, పార్కింగ్ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

రైతుల సమస్యలు తీర్చడానికే 'పొలంబడి'

గూడూరు టౌన్ : మండల పరిధిలోని విందూరు, మిట్టఆత్మకూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి రమేష్ మంగళవారం నిర్వహించారు. పంటలకు అవసరమైనంత వరకే ఎరువులు, పురుగు మందులు వాడాలని, అధిక రసాయనాలువ ఆడితే భూమి కలుషితమై నిస్సారం అవుతుందన్నారు. రబీకి సంబంధించి ప్రధాని ఫసల్‌బీమా యోజన కింద వరికి ఎకరాకు రూ.630 చెల్లించి డిసెంబర్ 31లోపు క్రాప్ ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కె.ప్రసన్న, ఎం.దివ్య పాల్గొన్నారు.

రైతులకు కావాల్సినంత యూరియా : భారతి

బిఎన్ కండ్రిగ : మండలంలోని 14 రైతుసేవా కేంద్రాలలో రబీ సీజన్‌కు అవసరమైన కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. ఇప్పటివరకూ అన్ని రైతు సేవా కేంద్రాలలో 300 ఎంటిఎస్ యూరియాను రైతులకు పంపిణీ చేశారు. తుపాను వల్ల కాస్త ఆలస్యమైనందున రైతులు ప్రస్తుతం నాట్లు వేస్తున్నారని, వారికి అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.



రామచంద్రాపురంలో.. ప్రతి రైతుకూ యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ లక్ష్మి అన్నారు. సి.రామాపురం, బలిజపల్లి గ్రామాల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి, వేరుశనగ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఉద్యాన అధికారి సునీల్ మాట్లాడుతూ మామిడి రైతులందరూ పంటల బీమా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫాం కంపెనీ రీజినల్ కోఆర్డినేటర్ విజయ్ ప్రసాద్, ఏవో స్రవంతి పాల్గొన్నారు.



టిడిపి కుటుంబంలో చేరండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రతి ఒక్కరూ టిడిపి కుటుంబంలో చేరి తమ జీవితాలను జయప్రదంగా సాగించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు చేత మంగళవారం ఎమ్మెల్యే టిడిపి సభ్యత్వాన్ని చేయించారు. వంద రూపాయలు కట్టి టిడిపి కుటుంబంలో చేరడం ద్వారా ఐదు లక్షల ప్రమాద బీమా పొందవచ్చని అన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఏడు గంగమ్మలకు సారె సమర్పణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఏడు గంగమ్మలకు మంగళవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీ సమేతంగా సారె సమర్పించారు. ఎమ్మెల్యే తో పాటు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి

పాఠశాలకు టివి వితరణ



పుత్తూరు టౌన్ : బొజ్జనత్తం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బి.భారతి రూ.30 వేల రూపాయలు వెచ్చించి పాఠశాలకు టివిని విరాళంగా ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయం అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ శాంతి, వైస్‌ఛైర్మన్ చెంచులక్ష్మి పాల్గొన్నారు.

సృజనాత్మక విద్యా బోధనకే శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -రామచంద్రపురం

ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన అందించడానికి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని సమగ్ర శిక్ష ఏఏఎంఓ మధు అన్నారు. మంగళవారం మండలంలోని సి రామాపురంలో గల మెడ్జ్ పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యలో ప్రాథమిక పాఠశాల అత్యంత కీలకమైనదని, ఒకటి, రెండు తరగతులకు పాఠ్య బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తిరుపతి ,చిత్తూరు జిల్లాల నుంచి మొత్తం 330 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరైనట్టు చెప్పారు.

నాగ బాబుకు మంత్రి పదవి కేటాయింపు హర్షనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

మెగా అభిమానుల రథ సారథి, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యర్శి కొణిదల నాగబాబుకు రాష్ట్ర క్యాబినెట్లో మంత్రి హోదా కల్పిస్తున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు కతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తూ, రాష్ట్రాభివృద్ధికి నాగబాబు న్యాయం చేస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. నాయకులు మోహన్, నాగార్జున, వంశీకృష్ణ, సాయి, సనత్, వెంకటేష్, సుమన్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నాలుగు ట్రాక్టర్లు పంపిణీ

రామచంద్రాపురం : స్వచ్ఛ భారత్ నిధులతో కొనుగోలు చేసిన నాలుగు ట్రాక్టర్లను గ్రామపంచాయతీలకు స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి పంపిణీ చేశారు. మండలంలోని నెత్తకుప్పం , కుప్పం బాదూరు, దేసూరు కండ్రిగ, సి. రామాపురం గ్రామ సచివాలయాల అధికారులకు టాక్టర్ బీగాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరా, తహసిల్దార్ కే వెంకటరమణ, స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ మురళి నాయుడు, పసుపులేటి విజయ్ కుమార్, కేశవులు నాయుడు పాల్గొన్నారు.

శిథిలావస్థ ట్యాంకును తొలగించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

తడుకు పంచాయతీ ఎగువగూళూరు దళితవాడలో దాదాపు 30 ఏళ్ల క్రితం గ్రామానికి తాగునీటి కోసం ఓ వాటర్ ట్యాంక్ నిర్మించారని, ప్రస్తుతం అది నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుకుందని దళితులు ఎంపిడిఓ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. దీని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. మోహన్ మాట్లాడుతూ ట్యాంకు ఎంపిపి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, చర్చికి మధ్యలో ఉందన్నారు. శిథిలావస్థ ట్యాంకు కింద పాములు, జెర్రెలు, విషసర్పాలు తిరుగుతున్నాయని, పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ట్యాంకు నిరుపయోగంగా ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు సారా ప్యాకెట్లు, క్యానులు దాచి ఉంచుతున్నారని తెలిపారు. ఈ ట్యాంకును తొలగించి, పిల్లలకు ఎటువంటి హాని జరగకుండా చూడాలని పేర్కొన్నారు.

ప్రజలకు న్యాయం చేయడంలో పక్షపాతం చూపొద్దు : డిఎస్‌పి

ప్రజాశక్తి -దొరవారిసత్రం

పోలీసు వ్యవస్థలో పనిచేస్తున్న మనం పేదల ఫిర్యాదుల పరిష్కారంలో పక్షపాతం చూపకుండా వారికి న్యాయం చేసి పంపాలని నాయుడుపేట పోలీస్ డివిజన్ డిఎస్పి చెంచుబాబు సూచించారు. ప్రతి ఏడాదీ స్టేషన్ తనిఖీల్లో భాగంగా ఆయన మంగళవారం దొరవారిసత్రం పోలీస్ హౌస్‌ను తనిఖీ చేశారు. స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులు, పరిష్కరించిన వాటి వివరాల గురించి తెలుసుకున్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు,జాతీయ రహదారిపై మాదకద్రవ్యాల రవాణాపై దష్టి పెట్టి కట్టడి చేయాలని సూచించారు. యువత మత్తు కలిగించే గంజాయి వంటి వాటికి బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మహిళలు, మైనర్ బాలికల కేసుల్లో సత్వర పరిష్కారానికి చర్యలుచేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు, ఎస్ ఐ.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'ఎడ్‌సెట్ - 2024' స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీఈడీ కోర్స్ నందు ఆసక్తి కలిగి చేరదలచిన వారికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ఎస్వీయు రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు తెలిపారు. ఏపీ ఎడ్ సెట్ - 2024 లో అర్హత సాధించి ఉన్న విద్యార్థులు ఎడ్ సెట్ ర్యాంక్ కార్డ్ తో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో శుక్రవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ నందు హాజరుకావాలని డైరెక్టర్ ఆచార్య వూక రమేష్ బాబు వెల్లడించారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్ : ఎంఇఓ

ప్రజాశక్తి -కోట విద్యార్థి దశలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని కోట ఎంఈఓ దారా మస్తానయ్య అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని నెల్లూరు పల్లి, కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దారా.మస్తానయ్య రోజువారి తనిఖీల్లో భాగంగా ఆయా పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం మీల్స్ నిర్వహణ సక్రమంగా ఉందా లేదా అనే కోణంలో ప్రత్యక్షంగా మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశారు. అంతేకాకుండా నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సుప్రియ కిరణ్మయి ఉన్నారు.

వైఎస్‌ఆర్‌సిపి నిరసన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటి

వైయస్సార్సీపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 13న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక పద్మావతి పురంలోని తన నివాసం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాతలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13వ తేదీ జరగనున్న అన్ని జిల్లా కలెక్టరేట్లో వద్ద నిరసన కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష , తిరుపతి నియోజవర్గం సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుక్కను చంపిన నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కుక్కను చంపిన కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ శనివారం సాయంత్రం చేపల మార్కెట్టు ఎదురుగా ఉన్న స్కావెంజర్స్ కాలనీలో లావణ్య కుటుంబం పెంచుకుంటున్న ల్యాబ్ కుక్క టామీని, ఆ వీధిలో నివసిస్తున్న కుమార్, అతని కొడుకులు శివకుమార్, అరుణ్ కుమార్ తమను చూసి మొరుగుతుందని కోపోద్రేకంతో కత్తితో నరికి చంపారని తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు.

అదానీ ముడుపుల వ్యవహారం నిగ్గు తేల్చాలి: సీపీఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అదాని నుండి ప్రభుత్వ నేతలకు భారీగా ముడుపులు అందాయని ప్రపంచ వ్యాప్తంగా గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆర్థిక అరాచకానికి పాల్పడుతున్న అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు , సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. సిపిఐ దేశ వ్యాప్తంగా జాతీయ సమితి పిలుపు మేరకు మంగళవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద సిపిఐ తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నగర కార్యదర్శి జె విశ్వనాథ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రణీత్ ఫౌండేషన్ రక్తదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎడిఫై స్కూల్ డైరెక్టర్ పెనుమాడు ప్రణీత్ ఆలోచన నుంచి పుట్టిన ప్రణీత్ ఫౌండేషన్‌చే మంగళవారం రక్తదానం నిర్వహించారు. స్థానిక తిరుచానూరులోని ఆ స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రణీత్ మాట్లాడుతూ ఒక ప్రాణాన్ని బతికించే రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదని అన్నారు. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, యువత విరివిగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రణీత్ ఫౌండేషన్ విద్య, వైద్య రంగాలలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుంటుందని తెలిపారు. అనంతరం సుమారు 100 మందికి పైగా సిబ్బంది, విద్యార్థులు, రక్తదానం చేశారు.



పరిసరాల పరిశుభ్రతను కాపాడండి : సర్పంచి

ప్రజాశక్తి- ఏర్పేడు మేర్లపాక గ్రామ జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డుకు ఇరుపక్కల మేర్లపాక సర్పంచ్ గంగాధర్ స్వయంగా జెసిబి సహాయంతో ముళ్లపొదలను, చెత్తను తొలగించారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్డుకు ఇరు పక్కల ఉన్న ఖాళీ స్థలాన్ని బహిర్భూమికి ఉపయోగించరాదని, ఎవరైనా ఉపయోగించినట్లయితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

గర్భిణులు, రోగులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - కోట

కోట మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రధానమంత్రి సురక్షిత్ మాతత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణీలు, రోగులకు కోట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప దుప్పట్లు అందజేశారు. శ్రీ సాయిబాబా ఆలయ సంఘం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ఉన్న రోగులకు, గర్భిణీలకు దుప్పట్లను అందజేశారు. భోజనం ఏర్పాటు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిబాబా ఆలయం సంఘం నిర్వాహకులు విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

